క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్



శ్రీవారి ఆలయం ఎదుట బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మోక్షగుండం సేవలు ఆదర్శనీయం



నివాళి అర్పిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: ఇంజినీరింగ్ వ్యవస్థకే వన్నె తెచ్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఆదర్శనీయమని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు కొనియాడారు. మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి సందర్భంగా తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్దన్ రెడ్డి, డైరెక్టర్లు సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా సుపరిపాలన



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి) : రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి బాలాయపల్లె మండలం మన్నూరు పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని పథకాలు వివరించారు.

వాస్తవాలను వక్రీకరిస్తే సహించం

వెంకటగిరిరూరల్: ఎల్లో మీడియా వాస్తవాలను వక్రీకరించి విష ప్రచారం చేస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం బంగారుపేటలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు సమస్యలు తెలుపుకునేందుకు వస్తే, కొందరు సామాజిక మాధ్యమాల్లో ఎడిట్ వీడియోలను పోస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. వెంకటగిరివాసుల కలను సాకారం చేస్తూ పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారన్నారు. జాతరను వైభవోపేతంగా నిర్వహించేందుకు బుధవారం ఎన్‌జేఆర్ భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహిస్తే, తలుపులు వేసుకుని మీటింగ్ పెట్టుకున్నామని దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు.

తిరుమలలో రెండు పార్కులు ప్రారంభం



జీఎన్‌సీ వద్ద పార్కు ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల సుందరీకరణలో భాగంగా దాత వీవీ.రవికుమార్ సహాయంతో ఫిల్టర్ హౌస్ వద్ద, జీఎన్సీ వద్ద అభివృద్ధి చేసిన రెండు పార్కులను శుక్రవారం రాత్రి టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ప్రారంభించారు. ఇక్కడి ఫౌంటెన్‌లో అన్నమయ్య సంకీర్తనలు వినిపించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. పార్కు అభివృద్ధికి రూ. 8 లక్షలు, ఐదేళ్ల పాటు నిర్వహణకు రూ.30 లక్షలను దాత అందించారు. జీఎన్సీ వద్ద రూపొందించిన పార్కులో 65 హై ఎండ్ ప్రొజెక్టెడ్ లైట్లు, శంకు చక్ర నామాలతో కూడిన ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఈ పార్కు అభివృద్ధికి రూ.15 లక్షలు, ఐదేళ్ల నిర్వహణ కోసం రూ.80 లక్షలను దాత అందించారు. జేఈఓ వీరబ్రహ్మం, ఎస్2-2 జగదీశ్వర్‌రెడ్డి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డెప్యూటీ సీఎఫ్ శ్రీనివాసులు, ఈఈ శ్రీహరి, వీజీఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీకి విరాళంగా మూడు అంబులెన్సులు



అంబులెన్స్ తాళాలు అందజేస్తున్న దాతలు

తిరుమల: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝా శుక్రవారం రూ.93 లక్షల విలువైన మూడు అంబులెన్సులను టీటీడీకి విరాళంగా అందించారు. ముందుగా అంబులెన్సులకు శ్రీవారి ఆలయం ఎదురుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాల తాళాలను టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ డీజీఎం వరదరాజులు, ఆర్ఎం సత్యనారాయణ, శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి, ట్రాన్స్‌పోర్టు డీఐ జానకీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా మట్టి నా దేశంను విజయవంతం చేద్దాం



బియ్యం, మట్టిని సేకరిస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: ప్రధాని మోదీ స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం ఢిల్లీలో నిర్మిస్తున్న స్మృతి వనం కోసం దేశంలోని అన్ని ప్రాంతాల్లో మట్టిని, బియ్యాన్ని సేకరించి పంపుతున్నట్టు బీజేపీ నాయకుడు గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆ పార్టీ నాయకులు శుక్రవారం బీజేపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతిలో నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి బియ్యం, మట్టిని సేకరించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని తిరుపతిలో విజయవంతం చేద్దామని కోరారు. కార్యక్రమంలో నాయకులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, పొన్న విజయ్‌కుమార్, మునికృష్ణ యాదవ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగులకూ ఇంటి స్థలం



శ్రీనివాస సేతును పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: టీటీడీ ఉద్యోగులతో పాటు విశ్రాంత సిబ్బందికి కూడా ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీనివాససేతు వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరులో ఎవరినీ అసంతృప్తికి గురి చేయమన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 18వ తేదీన పట్టు వస్త్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా టీటీడీ భాగస్వామ్యంతో రూ. 650 కోట్లు వెచ్చించి నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వంతెనపై 19వ తేదీ నుంచి వాహనాల రాకపోకలను అనుమతించనున్నట్లు వివరించారు. అలాగే టీటీడీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అదనంగా మరో 200 ఎకరాలు సేకరించనున్నట్లు వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఈ ఏడాది కూడా సంప్రదాయబద్ధంగా తొలుత తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ముఖ్యమంత్రి దర్శించుకుని తిరుమలకు బయలుదేరి వెళతారని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ శిరీష, టీటీడీ జేఈఓ సదా భార్గవి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, ఆఫ్కాన్ సంస్థ మేనేజర్ రంగ స్వామి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి పరిశోధనల ఫలితాలు



మాట్లాడుతున్న వెస్ట్‌బెంగాల్ వెటర్నరీ వర్సిటీ వీసీ దాణా

తిరుపతి సిటీ: ఎస్వీయూలో చేపట్టిన పరిశోధనల ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలని వెస్ట్‌బెంగాల్ వెటర్నరీ వర్సిటీ వీసీ ఎస్ఎస్ దాణా పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో సుస్థిర గ్రామీణ జీవనోపాధి సాధనపై రెండు రోజులుగా సాగుతున్న జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సుకు పరిశోధనలు ఉపయోగపడాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు. జాతీయ సదస్సులతో గ్రామీణ ప్రజల సమస్యలను, అవసరాలనుతెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించవచ్చని వెల్లడించారు. ప్రధానంగా పశువైద్య శాస్త్రవేత్తలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అధ్యయనం చేయాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం, సూచనలు అందించినప్పుడే సుస్థిర జీవనోపాధిని అందించగలమని స్పష్టం చేశారు. అనంతరం రైతులు, యువ పారిశ్రామిక వేత్తలు తమ ఆవిష్కరణలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అతిథుల చేతులమీదుగా పంపిణీ చేశారు. అసోసియేట్ డీన్ జగపతి రామయ్య, వెటర్నరీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ కె.వీరబ్రహ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ జీఆర్‌కే శర్మ పాల్గొన్నారు.

పట్టుగూళ్ల ఒడుపులో కొత్త టెక్నాలజీ



జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది. సామాన్య రైతుగా పట్టుగూళ్ల ఒడుపులో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. నాణ్యతలేని పత్తి గూళ్లను మార్కెట్‌లో ఆశించినంత ధరకు విక్రయించలేక సతమతమయ్యాం. దీనిపై ఆలోచించి హారిజాంటల్ కుకున్ హార్వెస్టర్ అనే పరికరం కనిపెట్టా. దీంతో ఆకు గూళ్లను సులభతరంగా శుభ్రం చేసి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో మంచి ధరలకు విక్రయించవచ్చు. యంత్రం విలువ రూ.40వేలు, రిపేర్లు ఉండవు. మోటార్ బైక్, విద్యుత్, చేతితో యంత్రాన్ని ఆపరేట్ చేయవచ్చు. రోజుకు సుమారు 600కేజీల వరకు పట్టుగూళ్లు శుభ్రపరచవచ్చు.

– గాండ్ల గురుమూర్తి, రైతు, పలమనేరు

చెరువుల ప్రక్షాళనకు చైన్ డ్రాగింగ్



రొయ్యలచెరువుల ప్రక్షాళనకు చైన్ డ్రాగింగ్ యంత్రం ఎంతో ఉపయోగకరం. రొయ్య పిల్లలను చెరువులో వదిలే 2 నెలల ముందు ఈ యంత్రంతో రెండు మార్లు డ్రాగింగ్ చేయడంతో బ్యాక్టీరియా, ఫంగస్ నశించిపోతాయి. దీంతో పాటు ఆక్సిజన్ పూర్తి స్థాయిలో రొయ్యలకు అందుతుంది. ఆరోగ్యకరమైన పంట రైతులకు దక్కుతుంది. ఈ యంత్రానికి గాను మాకు పేటెంట్ హక్కు కూడా లభించింది.

– తౌషిక్ అహ్మద్, ఫ్యాకల్టీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు

క్రీడా కేంద్రంగా ఆర్సీపురం

రామచంద్రాపురం: క్రీడా కేంద్రంగా ఆర్సీపురాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. మండలంలోని నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ 9 ఉన్నత పాఠశాలలకు చెందిన 250 మంది క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో 148 మంది నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈ నెల 20, 22, 25వ తేదీల్లో చంద్రగిరి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం తులసి కుమారి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి, పీడీలు రామకృష్ణ, సురేష్, గోపీనాథ్, దేవరాజ్, భార్గవి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

భాకరాపేట: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం.యుగంధర్ రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మృదులాదేవి, సర్పంచ్ మనోహర్, ఖదీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మార్గనిర్దేశకుడు 'మోక్షగుండం'



విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలోని ఇంజినీర్లకు మార్గనిర్దేశకుడని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొనియాడారు. శుక్రవారం తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఇంజినీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోక్షగుండం సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, క్వాలిటీ కంట్రోల్ జిల్లా అధికారులు శంకర్ నారాయణ, విజయకుమార్, శంకరయ్య నేతృత్వంలో ఇంజినీర్లు కమిటీగా ఏర్పడి మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ప్రతిష్టించడం అభినందనీయమన్నారు.ఇంజినీర్లు సత్యనారాయణరెడ్డి, గిరిధర్, రఘురామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

తిరుపతి కల్చరల్ : పర్యావరణానికి మేలు చేసేలా మట్టి గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తుడా మైదానం ఇండోర్ స్టేడియంలోని శ్రీవర సిద్ధి వినయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించినట్లు వెల్లడించారు. వినాయక సాగర్‌లో నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు వివరించారు. వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి తిరుమలలో జడ్జి విధులు

తిరుపతి లీగల్: తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి 26 వరకు తిరుమలలో విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సమయంలో ఆ కోర్టుకు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్ వ్యవహరిస్తారని వెల్లడించింది.

దారికాచిన మృత్యువు

మొదలే అనారోగ్య సమస్యలు. పెనిమిటి ప్రాణం నిలుపుకోవాలని ఆ ఇల్లాలు బంధువులను వెంటబెట్టుకుని రాష్ట్రంగాని రాష్ట్రం వచ్చింది. అక్కడా సమస్యలు వెంటాడడంతో తిరిగి సొంత రాష్ట్రానికి వెళ్లాలని నిశ్చయించుకుంది. కన్నీళ్లు దిగమింగుకుని .. కడుపునిండా బాధలు నింపుకుని అంబులెన్స్ ఎక్కింది. కొంత దూరం వెళ్లగానే దారికాచిన మృత్యువు ట్యాంకర్ రూపంలో వెంటాడింది. అనారోగ్యంతో బాధపడుతున్న భర్తతో సహా ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. పొద్దుపొడవక ముందే జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

- ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న అంబులెన్స్
- ఒడిశాకు చెందిన ఐదుగురు దుర్మరణం
- తవణంపల్లె మండలంలో వేకువజామున ఘటన
- డ్రైవర్ కునుకుతోనే ప్రమాదం?

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ వేగంగా ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం.. ఒడిశా రాష్ట్రం కేంద్రపారకు చెందిన ఉమేష్‌చంద్రసాహు(46) యూరిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం భార్య రష్మితసాహు(45), మామ త్రిలోచాన్‌నాయక్(63), సమీప బంధువు బిజయ్‌నాయక్(56)తో కలిసి గురువారం ఒడిశా నుంచి ప్రైవేటు అంబులెన్స్‌లో బెంగళూరులోని ఒక హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. శుక్రవారం వేకువ జామున సుమారు 4.15 గంటల సమయంలో మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమేష్ చంద్రసాహు, భార్య రష్మితసాహు, త్రిలోచాన్‌నాయక్, బిజయ్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్లు జాటిన్‌కుమార్ సాహుల్(30) చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. సంజయ్‌కుమార్ జేనా(30), సహాయకుడు దేబబ్రతదాస్(24) స్వల్పంగా గాయపడ్డారు. అంబులెన్స్ డ్రైవర్ కునుకుపాటే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.



సంఘటనలో మృతి చెందిన ఒడిశా మృతుల వివరాల కోసం ఫోన్ చేస్తున్న చిత్తూరు సీఐ రవిశంకర్ రెడ్డి

ఆధార్ కార్డుల ఆధారంగా గుర్తింపు

సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను జెసీబీ సహాయంతో బయటకు తీశారు. లభించిన ఆధార్ కార్డుల ఆధారంగా వారు ఒడిశాకు చెందిన వారుగా గుర్తించారు. వారి బంధువుల ఫోన్ నంబర్లకు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం, మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, యాదమరి ఎస్ఐ సుమన్ పరిశీలించారు. ప్రమాద జరిగిన తీరుపై ఆరా తీశారు. హైవేలో రాత్రి సమయంలో లారీలను పార్కింగ్ చేయకుండా చూడాలని పోలీసులకు సూచనలు ఇచ్చారు.

ఆగి ఉన్న వాహనాతోనే ప్రమాదం

తవణంపల్లె మండలంలోని తిరుపతి బెంగళూరు జాతీయ రహదారి పట్నం వద్ద ఆరు నెలల కిందట బెంగుళూరు నుంచి స్వగ్రామం గుంటూరుకు వెళ్తున్న కుటుంబం కారు వేకువజామున ఆగిఉన్న పాల ట్యాంకరును ఢీకొంది. ఈ ఘటనలోభార్య, భర్త, కుమారుడు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి ఒడిలో మూడు సంవత్సరాల కుమారుడు చనిపోవడం పలువురిని కలిచి వేసింది. శుక్రవారం జరిగిన ప్రమాదంకు, గతంలో పట్నం వద్ద జరిగిన ప్రమాదానికి మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంది. జాతీయ రహదారిలో లారీలు, ట్యాంకర్లను రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ ఆపేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి ఆరులైన్లు కావడంతో కార్లు వేగంగా వెళ్తుంటాయి. కాని రోడ్డు పక్కన చీకట్లో ఆపి ఉన్న వాహనాలను వేగంగా వెళ్లే వాహనాల డ్రైవర్లు గుర్తించక పోతుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎమ్మెల్యే సంతాపం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. బయట రాష్ట్రం వారు కాబట్టి వారికి తగు సహాయక చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



ఉమేష్‌చంద్రసాహు



రష్మితసాహు



త్రిలోఛాన్‌నాయక్



బిజయ్‌నాయక్

క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



తిరుపతి మంగళం : మంగళం రణధీర్‌పురం పంచాయతీ బీటీఆర్‌కాలనీకి చెందిన వరుడు వెంకటప్రసాద్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని శుక్రవారం పంచాయతీ ఇన్‌చార్జ్ పీఎం.లక్ష్మీనారాయణ, పంచాయతీ అధ్యక్షుడు షేక్ రజాక్, ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, వార్డు మెంబర్లు సతీష్, మురళి, సురేంద్ర, సోమశేఖర్‌రెడ్డి, భాస్కర్, పంచాయతీ ఏపీఆర్‌వో రెడ్డెప్ప అందజేశారు.

నాదముని యాదవ్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న చంద్రగిరి పాత్రికేయులు

చంద్రగిరి: పాత్రికేయుడు నాదముని యాదవ్ మృతి తీరనిలోటని చంద్రగిరి జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. నాదముని యాదవ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జానకీ రామాచారి, సోమనాథరెడ్డి, రూపసుందర్ నాయుడు, చంద్రశేఖర్, లీలాకృష్ణ, కిషోర్, భూమిరెడ్డి నరేష్, గల్లా సుబ్రమణ్యం, రమణ, పార్థసారథి, రఘు, సత్య పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర నగర్ పంచాయతీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకూ వెళ్లి తన బిడ్డ మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన



తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా కామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమైన లక్ష కుంకుమార్చన మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు చంద్రశేఖరస్వామి, మనోన్మణి అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత దేశంగా భారత్

తిరుపతి తుడా : పర్యావరణ హిత దేశంగా భారత్‌ను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ కరుణ కుమార్ పిలుపునిచ్చారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సంయుక్తంగా శుక్రవారం జీవ వ్యర్థాల నిర్వహణ అనే అంశంపై ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. అనంతరం సైంటిస్టు సుధాకర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివిధ రకాల జీవ వ్యర్థాలు, వాటి నిర్మూలనను శాస్త్రీయ పద్ధతుల్లో ఎలా చేయాలో వివరించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథి రెడ్డి, ఆర్ఎంఓ ఆర్ఆర్ రెడ్డి, ప్రమీల, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధితో మారనున్న తిరుపతి భవిత

- రెండు కళ్లుగా సంక్షేమం, అభివృద్ధి
- శ్రీవారి సేవకుల పేరుతో తిరుపతికి ఆధ్యాత్మిక శోభ
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



తిరుప్పావై మార్గం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ

తిరుపతి తుడా: రోడ్ల అభివృద్ధితో ఆధ్యాత్మిక నగరం తిరుపతి భవిష్యత్తు మారనుందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణతో కలిసి తిరుపతి నగర పరిధిలో రూ.4.78 కోట్లతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి తిరుపతి నగరాన్ని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఇరుకు రోడ్ల స్థానంలో విశాలవంతమైన రోడ్లు వేస్తూ ప్రజలకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం కల్పిస్తున్నామన్నారు. 40 ఏళ్ల తర్వాత కొర్లగుంటలో మాస్టర్ ప్లాన్ రోడ్డు వేసి ప్రజల ఇబ్బందులు తొలగించినట్లు వివరించారు. ఈ రోడ్డు అభివృద్ధిలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. నగరంలోని రహదారులకు తిరుమల శ్రీవారి సేవలో తరించిన మహనీయులు, సేవకుల పేర్లను పెట్టడం ద్వారా తిరుపతికి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోందన్నారు. కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డుకు తిరుమల ఆలయంలో ఆనంద నిలయాన్ని నిర్మించిన వీర నరసింగ యాదవ రాయ పేరు, కరకంబాడి రోడ్డు వినాయక సాగర్‌కి పడమటి వైపున అక్కారంపల్లికి తూర్పువైపున విస్తరించిన 40 అడుగుల రోడ్డుకు తిరుప్పావై మార్గంగా నామకరణం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథరెడ్డి, కేతం జానకి, ఆదం రాధాకృష్ణా రెడ్డి, బోకం అనీల్ కుమార్, తిరుపతి మునిరామిరెడ్డి, శేఖర్ రెడ్డి, దూది కుమారి, కో ఆప్షన్ సభ్యులు వెంకట రెడ్డి, ఇమామ్ సాహెబ్, నాయకులు ఏడీఆర్, దేవదానం, పాముల రమేష్ రెడ్డి, తలారి రాజేంద్ర, నాగిరెడ్డి, వెంకటేష్, దూది శివ, చోటా ఖాసీమ్, సాకం ప్రభాకర్, వెంకటేష్ రాయల్, దినేష్ రాయల్, లక్ష్మీ వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, గీతాయాదవ్, శాంతారెడ్డి, జగదీష్ యాదవ్, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

కొర్లగుంట రోడ్డు అభివృద్ధితో ఆ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రారంభోత్సవం అనంతరం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ నాయకులతో కలిసి అభివృద్ధి చేసిన వీరనరసింగయాదవరాయ మాస్టర్ ప్లాన్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. వారికి స్థానికులు దారి పొడవునా ఘన స్వాగతం పలికారు.

22ఏ రద్దుతో వేల కుటుంబాల్లో వెలుగులు



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- 105 ఎకరాల్లో 7790 మందికి హక్కు
- దేశంలోనే మహానగరంగా తిరుపతి
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : గత టీడీపీ ప్రభుత్వంలో తిరుపతిలోని పలు ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరగకుండా చంద్రబాబు తీసుకొచ్చిన 22ఏను రద్దు చేయడంతో సుమారు 7,790 మంది జీవితాల్లో వెలుగులు నిండాయని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో 8వ డివిజన్ సంజయ్ గాంధీకాలనీ ప్రజలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు 22ఏను తీసుకొచ్చి 105 ఎకరాల్లోని భూములు, ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితాలోకి చేర్చారని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యను విన్నవించారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తాను ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 22ఏను రద్దు చేయించినట్టు వివరించారు. తాము ప్రజలకు మేలు చేస్తుంటే చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నాయకులు విమర్శలు చేయడంతో పాటు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఎన్ని చేసినా ప్రజల మద్దతుతో తిరుపతిని దేశంలోనే మహా నగరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. నిషేధిత జాబితాలో ఉన్న మరికొన్ని ప్రాంతాలకు కూడా త్వరలోనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు భూమన అభినయ్‌రెడ్డిని కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డితో కలిసి స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఇమామ్, నాయకులు పాముల రమేష్ రెడ్డి, మురళి, గఫూర్, రవిచంద్ర, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, దినేష్‌రాయల్ పాల్గొన్నారు.

కార్మికులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



మాట్లాడుతున్న జడ్జి కిరణ్‌కుమార్

తిరుపతి రూరల్: జిల్లాలోని అసంఘటిత రంగంలోని కార్మికులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, శిక్షణ నిర్వహించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ ఆదేశించారు. తిరుపతిలోని కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం కార్మిక శాఖాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంఘటిత కార్మికులకు ప్రతిపాదిత పోర్టు ఆధారిత పనులు, వడ్రంగి, బేకరి, వ్యవసాయం, టైలరింగ్ తదితర రంగాల్లో సాధారణ జీవనోపాధిని కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అందుకోసం స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపకార్మిక కమిషనర్ యం.బాలునాయక్, సహాయ కార్మిక కమీషనర్ కృష్ణారెడ్డి, సహాయ కార్మిక కమిషనర్ చిన్న లాలెప్ప, సహాయ కార్మిక అధికారులు రాజయ్య, శ్రీమన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో రైతులకు శిక్షణ

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) దత్తత గ్రామమైన మన్న సముద్రం, బండారుపల్లికి చెందిన రైతులకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పంటల సాగులో శుక్రవారం నూతన సాంకేతిక పద్ధతులపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఆర్ఏఆర్ఎస్ సహ పరిశోధన సంచాలకులు సి.రమణ మాట్లాడుతూ అధిక దిగుబడి నిచ్చే నూతన వంగడాలను రైతులు ఉపయోగించాలన్నారు.మదన్మోహన్, మహేశ్వర్ రెడ్డి, దేవకి, భాస్కర్ రెడ్డి, టి.ప్రతిమ, రవీందర్ రెడ్డి, కలీముల్లా, బాల హుస్సేన్ రెడ్డి హాజరై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు పరిశోధన స్థానంలోని వివిధ క్షేత్రాలతో పాటు చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ని సందర్శించారు.

వైఎస్సార్ సీపీ తిరుపతి డివిజన్ అధ్యక్షుల నియామకం

తిరుపతి మంగళం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లకు నలుగురు వైఎస్సార్ సీపీ అధ్యక్షులను నియమించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 1 నుంచి 11 డివిజన్లకు సంబంధించి అధ్యక్షులుగా ఆదం సుధాకర్‌రెడ్డి, 12వ డివిజన్ నుంచి 24 డివిజన్లకు అధ్యక్షులుగా పడమటి కుమార్, 9, 23 నుంచి 38 డివిజన్లకు అధ్యక్షులుగా యచ్చం వాసుయాదవ్, 34, 39 నుంచి 50వ డివిజన్లకు అధ్యక్షులుగా అప్పను సురేంద్రనాథరెడ్డి నియమితులయ్యారు. వారు ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు, కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పథకాలను ప్రజలకు అందించడానికి కృషి చేస్తారు.



ఆదం సుధాకర్‌రెడ్డి



పడమటి కుమార్



యచ్చం వాసుయాదవ్



అప్పను సురేంద్రనాథరెడ్డి

ఘనంగా అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని ఆ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకులు సీఎల్.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.గంగాధర్ రావు మాట్లాడారు. ప్రజాస్వామ్యం విజయవంతంగా ముందుకు సాగాలంటే రాజకీయ, పరిపాలనలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. ప్రపంచ రాజకీయ వాతావరణంలో యువకులు ప్రస్తుతం, భవిష్యత్తు ప్రజాస్వామ్యానికి సంరక్షకులని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సి.వాసుదేవులు నాయుడు, అధ్యాపకులు వై.చిన్నికేశవులు, ఎస్.భారతమ్మ, సి.రేవతి పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

వాణిజ్య శాస్త్రంతో అవకాశాలు అపారం అనే అంశంపై ఎస్వీ జూనియర్ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మేక్ ఇన్ ఇండియా పిలుపుతో వాణిజ్య శాస్త్రం ద్వారా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఈ శాస్త్రంలో ఉన్నత విద్యనభ్యసించేందుకు అనువైన కోర్సులు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు.

సర్టిఫికెట్ల పంపిణీ

పాకాల : జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం స్థానిక సచివాలయంలో సర్టిఫికేట్లు అందజేశారు. జెడ్పీటీసీ సంగా పద్మాజారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఎంపిక చేసి వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

ఎన్‌బీఏ తనిఖీలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ సంస్థ బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. అంతముందు వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాలలోని ప్రతి విభాగంలోని ల్యాబ్‌లు, తరగతి గదులు, హాస్టల్ వసతులను పరిశీలించి బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులను ఆరా తీసి నివేదిక అందజేయనున్నారు. కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ దామోదర్‌రెడ్డి, ప్రొఫెసర్ వెంకట్రామయ్య, అధికారులు ఉన్నారు.

అన్నమాచార్య కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే



విద్యార్థులను అభినందిస్తున్న తెలుగుగంగ ప్రాజెక్ట్ ఈఈ డి.రాధాక్రిష్ణమూర్తి, ప్రిన్సిపాల్

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ముఖ్యఅతిథిగా తెలుగుగంగ ప్రాజెక్ట్ ఈఈ డి.రాధాక్రిష్ణమూర్తి హాజరై ప్రసంగించారు. నీటి ప్రాజెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కపిలతీర్థం నుంచి వచ్చే నీటిని నిల్వ చేసే విధానం, భావితరాలకు నీటిని అందించే ప్రక్రియను వివరించారు. ప్రిన్సిపాల్ సి నాదమునిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని పెంపొందించుకోవాలని కోరారు. జే.గురు జవహర్ పాల్గొన్నారు.

'మోక్షగుండం' సేవలు చిరస్మరణీయం

తిరుపతి కల్చరల్/తిరుపతి సిటీ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, నిర్మాణ రంగంలో చేసిన సేవలు చిరస్మరణీయమని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఇంజనీర్స్‌డే సందర్భంగా శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి రంగస్థలి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రంగస్థలి ప్రతినిధులు అక్కిపల్లి మునిక్రిష్ణ, సుబ్రమణ్యం యాదవ్, విజయ్‌కుమార్, సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఎస్వీయూలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తిరుపతి లోకల్ సెంటర్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలోని రాజీవ్‌నగర్ సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాంధీపురం, శ్రీనగర్‌కాలనీ, వైకుంఠపురం, శ్రీకృష్ణనగర్, శేషాద్రినగర్, దుర్గానగర్, ఎంఆర్‌పల్లి, మునిరెడ్డినగర్, పద్మావతినగర్, శ్రీనివాసనగర్, ఎల్‌బీ నగర్, గాయత్రి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాకాలవారిపల్లిలో ఇళ్ల తొలగింపు



పాకాలవారిపల్లి సమీపంలో జేసీబీతో ఇళ్లను తొలగిస్తున్న అధికారులు

చంద్రగిరి: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని పాకాలవారిపల్లిలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లను అధికారులు శుక్రవారం తొలగించారు. తమకు నష్టపరిహారం చెల్లించలేదంటూ యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో అధికారులు వారికి నష్టపరిహారం చెల్లించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో శుక్రవారం పెండింగ్‌లో ఉన్న కట్టడాలను తొలగించి, జాతీయ రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. కొంత మంది నిర్వాసితులు తమకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే కూల్చివేయాలని పట్టుబట్టారు. పరిహారం చెల్లించడంలో ఆలస్యం చేయబోమని తహసీల్దార్ శిరీష, సీఐ రాజశేఖర్ హామీ ఇచ్చారు. 1.5 కిలోమీటర్ల మేర రహదారి పెండింగ్‌లో ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు పూర్తయితే ప్రజల ప్రాణాలను కాపాడుకోవచ్చని వెల్లడించారు. మంచి కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అభ్యంతరాలు తెలపండి

తిరుపతి తుడా: తిరుపతి నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూత్‌లపై అభ్యంతరాలను రెండు రోజుల్లో రాతపూర్వకంగా తెలపాలని తిరుపతి ఓటరు నమోదు అధికారి హరిత తెలిపారు. ఆమె శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అనువైన బూత్‌లు లేకపోవడంతో కొన్నింటిని మార్పు చేశామన్నారు.

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాస్టల్ భవనం పరిశీలన

తిరుపతి సిటీ : స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నూతన హాస్టల్ భవనాన్ని శుక్రవారం టీటీడీ జేఈఓ సదా భార్గవి పరిశీలించారు. ఈ భవనాన్ని సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆమె కళాశాల అధికారులతో సమావేశమై హాస్టల్ భవన నిర్మాణ పనులు, సౌకర్యాలపై ఆరా తీశారు.

నేడు డయల్ యువర్ డీఎం

తిరుపతి అర్బన్: మంగళం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు, స్థానికుల సమస్యలు తెలపడానికి శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 6 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డీఎం భాస్కర్‌రావు తెలిపారు. ఇందుకోసం 7893723453కు కాల్ చేయాలని కోరారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా యూనివర్సిటీ గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. 40 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, రేణిగుంటకు చెందిన చెఫ్ విష్ణుప్రియ, గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.అరుణ వంటకాలను పరిశీలించి వారిని ప్రశంసించారు.

అనుమతి తప్పనిసరి

పాకాల: వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ ఓబులేశు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వారు ఇతర మతస్తులను కించపరిచేలా ప్రవర్తించకూడదన్నారు. ఆర్కెస్ట్రాలకు డీఎస్పీ నుంచి అనుమతులు పొందాలని గుర్తు చేశారు. విగ్రహ ఊరేగింపులోగాని, లేక ఇతర సమయాల్లో గాని టపాయలు పేల్చి ధ్వని కాలు ష్యం చేయకూదన్నారున్నారు. విగ్రమ ఊరేగింపులో వాడే వాహనాలు మంచి కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని, వాహన డ్రైవర్‌కి లైసెన్స్ ఉండాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని తిరుపతి రూరల్ ఎంపీడీవో వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఆయన తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్య, ఆరోగ్యశాఖాధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు.

డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాన్ని వేగంగా నడిపిన కేసులో డ్రైవర్ విశ్వనాథరెడ్డికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి రెండో ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వీ కోటకు చెందిన విశ్వనాథరెడ్డి ఈ నెల 12న మద్యం తాగి కారు నడుపుతుండగా చంద్రగిరి పోలీసులు తనిఖీ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అదేవిధంగా తిరుమలలో 14 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పు చెప్పారు. నిందితులను తిరుమల పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.